క్లుప్తంగా

మహిళా సాధికారతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సఖీ ఆధ్వర్యంలో విద్యార్థినులకు మహిళా సాధికారతపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సమాజంలో జరుగుతున్న అసమానతల గురించి డీఎంసీ శారద వివరించారు. బాలికల సంరక్షణకు ప్రభుత్వం రూపొందించిన చట్టాల గురించి తెలియజేశారు. బాలికలపై దాడులు జరిగితే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ఇన్‌చార్జి ఎస్‌వో జ్యోతి, జీఎస్ రాజేశ్వరి, రాణి, ఎస్ఎఫ్ఎల్ సాగర్, సీపీ మమత, పారామెడికల్ సత్య, ఐసీపీఎస్ రవళి, సీఆర్టీలు పాల్గొన్నారు.

పీఆర్టీయూకు రాజీనామా



రాజీనామా పత్రాలు చూపిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: పీఆర్టీయూ టీఎస్ సంఘానికి రాజీనామా చేస్తున్నట్లు సిర్పూర్ (యూ) నాయకులు ప్రకటించారు. జిల్లాకేంద్రంలోని లుంబిని దీక్ష భూమిలో మంగళవారం రాజీనామా పత్రాలను చూపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కాగజ్‌నగర్‌లో జరిగిన జిల్లా ఎన్నికల్లో మా మండలంలోని సభ్యులకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ఒకే ప్రాంతానికి చెందిన వారికి రెండు కీలక పదవులు ఇవ్వడం సరికాదన్నారు. అందుకే రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. సంఘం అధ్యక్షుడు దత్తు, కార్యదర్శి రాథోడ్, రవీందర్, సురేఖ, లక్ష్మకాంత్, శివప్రసాద్, జంగు తదితరులున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్‌రూరల్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఎస్టీటీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రావణ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం బదిలీ అయిన రిలీవ్ కాని పరిస్థితి నెలకొందని తెలిపారు. జీవో నెం 25ను సవరించే వరకు దశల వారీగా నిరసన కార్యక్రమాలు చేపడుతామని పేర్కొన్నారు.

కేజీబీవీల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్: కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలని కోరుతూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్ మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభమైన నాలుగు నెలలు గడుస్తున్నా నేటివరకు టీచర్ల పోస్టులు భర్తీ చేయకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారని తెలిపారు. వెంటనే పోస్టులు భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘం నాయకులు టీకనంద్, భీంరావు తదితరులు ఉన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత

రెబ్బెన: మండలంలోని గోలేటి సీహెచ్‌పీ సమీపంలో మంగళవారం అక్రమంగా తరలిస్తున్న పశువులను పట్టుకున్నట్లు ఎస్సై డి.చంద్రశేఖర్ తెలిపారు. మహారాష్ట్రలోని గడ్‌చందూర్‌కు చెందిన సులేమాన్..ఎలాంటి అనుమతి లేకుండా 8 ఎద్దులను బొలేరో వాహనంలో తరలిస్తుండగా వాహనాల తనిఖీల్లో భాగంగా పట్టుకున్నామని పేర్కొన్నారు. వాహనాన్ని సీజ్ చేసి, పశువులను కాగజ్‌నగర్‌కు తరలించినట్లు తెలిపారు. డ్రైవర్ మెస్రం ప్రతిక్, క్లీనర్ ఎస్‌కే అసీఫ్‌తోపాటు సులేమాన్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వ్యక్తి బైండోవర్

సిర్పూర్(టి): అక్రమంగా టేల ఏర్పాటు చేసిన వ్యక్తిని తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట మంగళవారం బైండోవర్‌చేసినట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. మండల కేంద్రంలోని నాగమ్మ చెరువు సమీపంలో సోమవారం అర్ధరాత్రి ఓ వ్యక్తి అక్రమంగా టేల ఏర్పాటు చేస్తున్నారని సమాచారం వచ్చింది. అతన్ని స్థానిక తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

బైక్ అదుపు తప్పి ఇద్దరికి గాయాలు

బెజ్జూర్: బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని పాపన్నపేట గ్రామానికి చెందిన శివ బిశ్వాస్, బుజాడి సంతోష్ కలిసి బైక్‌పై మంగళవారం కాగజ్‌నగర్ వెళ్లి వస్తుండగా బెజ్జూర్ నాగులమ్మ చింత వద్ద అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో సంతోష్, శివ విశ్వాస్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

ఈజీగా రాజీ..!

- 28న సిర్పూర్(టి) కోర్టులో జాతీయ లోక్ అదాలత్
- రాజీనే..రాజమార్గం
- పెండింగ్ కేసులకు మోక్షం



జాతీయ లోక్ అదాలత్ పై సిర్పూర్ సివిల్ కోర్టులో పోలీసులతో సమావేశమైన సివిల్ జడ్జి అజయ్ ఉల్లం



లోక్ అదాలత్

కౌటాల: న్యాయస్థానాల్లో కొన్ని కారణాల రీత్యా కేసుల పరిష్కారం సత్వరం జరగదు. బాధితులు ఏళ్ల పాటు కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. కేసుల పరిష్కారంలో జాప్యం జరుగుతోంది. దీనికి తోడు వాది, ప్రతివాదులు కూడా కొన్ని సందర్భాల్లో పరిష్కారాలకు సుముఖంగా ఉండక కాలయాపన జరుగుతుంటుంది. దీంతో డబ్బుతోపాటు సమయం వృథా అవుతోంది. కేసుల సత్వర పరిష్కారం కోసం లీగల్ సర్వీస్ అథారిటీ చట్టం -1987 కింద లోక్ అదాలత్‌లు ఏర్పాటు చేసింది. పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ఏటా లోక్ అదాలత్ నిర్వహిస్తోంది. దీంతో ఏటా వేల కేసుల పరిష్కారమవుతున్నాయి. బాధితులకు సత్వరమే పరిష్కర మార్గం చూపిస్తోంది.

రాజీతోనే మేలు..

ఇతర న్యాయసేవల సంస్థలతో కలిసి లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారు. ఇది ప్రత్యామ్నాయ వివాద పరిష్కార వేదిక. న్యాయస్థానం, వాజ్యానికి ముందు దశలో పెండింగ్‌లో ఉన్న వివాదాల, కేసులను సామరస్యంగా పరిష్కరించుకునే వీలు కేవలం లోక్ అదాలత్‌లో ఉంది. జిల్లాలోని కౌటాల మండలానికి చెందిన భార్యభర్తలకు ఇద్దరు కుమార్తెలున్నారు. అక్కాచెల్లెలు సమత–మమత మధ్య వారసత్వంగా కొన్ని ఆస్తులు సంక్రమించాయి. అయితే పంపకాల్లో ఏకాభిప్రాయం కుదరలేదు. వారికి నచ్చజెప్పేందుకు బంధువులు, కుటుంబీకులు ప్రయత్నించి విఫలమయ్యారు. ఈ లోపు ఇద్దరి మధ్య విభేదాలు ముదరడంతో సమత కోర్టును ఆశ్రయించింది. నాలుగేళ్ల పాటు చెప్పులరిగేలా కోర్టు చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. న్యాయవాది సలహాతో లోక్ అదాలత్‌ను ఆశ్రయించడంతో వారాల వ్యవధిలో సమస్య పరిష్కారమైంది. శత్రువులుగా మారిన అక్కాచెల్లెల మధ్య మళ్లీ కుటుంబ సత్సంబంధాలు నెలకొన్నాయి.

తీర్పు అంతిమం..

చట్టాలపై అవగాహన ఉండాలని పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. కానీ ఇప్పటికి చాలా మందికి లోక్ అదాలత్ (పీపుల్స్ కోర్ట్)పై అవగాహన లేదు. రాజీకి అవకాశం ఉన్న కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చు. ఇక్కడ ఇచ్చే తీర్పు అంతిమం. లోక్ అదాలత్ కేసు పరిష్కారమైనప్పుడు అవార్డు(తీర్పు)కు వ్యతిరేకంగా ఏ న్యాయస్థానం ముందు అప్పీల్ చేయడానికి కుదరదు. లోక్ అదాలత్ తీర్పుతో ఇరుపక్షాల మధ్య మంచి సంబంధాలు ఏర్పడతాయి.

28న జాతీయ లోక్‌అదాలత్

సివిల్, రాజీ చేయదగిన క్రిమినల్ కేసులతో వేగవంతమైన, సామరస్య పరిష్కారం కోసం ఈ నెల 28న సిర్పూర్(టి) జ్యూడీషియల్ సివిల్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ జరగనుంది. కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏళ్లుగా వందల కొద్ది కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇరువర్గాల వారు తమ కేసులను ఇక్కడ పరిష్కరించుకోవాలని పోలీసులు, న్యాయవాదులు సూచిస్తున్నారు. ఫిర్యాదుదారుడు, నేరాస్తులు తమ ఆధార్‌కార్డులను వెంట తీసుకురావాలని పేర్కొంటున్నారు. తాజాగా సిర్పూర్(టి) సివిల్ కోర్టులో పోలీస్ అధికారులతో జూనియర్ సివిల్ జడ్జి అజయ్ ఉల్లం ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని కేసులు

మండలం	కేసులు
కాగజ్‌నగర్	205
దహెగాం	26
పెంచికల్‌పేట్	22
కౌటాల	55
సిర్పూర్(టి)	55
బెజ్జూర్	52
చింతలమానెపల్లి	24
మొత్తం	439

కేసులు రాజీ చేసుకోవాలి



ఈనెల 28న సిర్పూర్(టి) కోర్టులో జరిగే లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసులు రాజీ చేసుకోవాలి. లోక్ అదాలత్ కేసులకు ఎలాంటి ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదు. లోక్ అదాలత్ గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. వివరాలకు కౌటాల సీఐ 8712670512, ఎస్సై 8712670543 సంప్రదించాలి.

– ఎస్.మధుకర్, ఎస్సై, కౌటాల

ప్రజలకు లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించి కేసులను రాజీమార్గంలో పరిష్కారమయ్యే విధంగా చూడాలన్నారు. కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో మొత్తం 439 కేసులున్నాయి.

పరిష్కారం చూపే కేసులు..

క్రిమినల్, సివిల్, వివాహ, కుటుంబ తగాదా, రోడ్డు ప్రమాదం, చిట్ ఫండ్, డ్రంకెన్ డ్రైవ్, ట్రాఫిక్, కోర్టు పెండింగ్‌లో ఉన్నవి, దొంగతనం, బ్యాంకు రికవరీ, సెల్‌ఫోన్ రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్‌బౌన్స్, డబ్బులను రికవరీకి సంబంధించిన కేసులు, కార్మిక సంబంధిత కేసులు, క్రిమినల్ కంపౌండబుల్ కేసులు ఉన్నాయి.

నాణ్యమైన విద్యనందించాలి



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాకేంద్రంలోని మెడికల్ కళాశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. పార్టీ నాయకులతో కలిసి మెడికల్ కళాశాలను సందర్శించారు. ప్రిన్సిపాల్ సతీశ్‌తో మాట్లాడి విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసీ వెనుకబడిన ప్రాంతం అభివృద్ధి చెందాలని ఉద్దేశంతో జిల్లాకు మెడికల్ కళాశాల తమ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అయితే ప్రొఫెసర్ల నియామకంలో కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. తుడందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు పోచయ్య, పార్టీ నాయకులు ఉన్నారు.

పెరటి కోళ్ల పంపిణీ



కోళ్లను పంపిణీ చేస్తున్న అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్: ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మంగళవారం స్త్రీ చైతన్య మండల సమాఖ్య పరిధిలోని లబ్ధిదారులకు పెరటి కోళ్లను పంపిణీ చేశారు. జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, ఎంపీడీవో రమేశ్, డీపీఎం సారయ్య, ఏపీఎం భూమక్కలు అర్హులైన 56 మంది లబ్ధిదారులకు కోడి పిల్లలను అందజేశారు. కోళ్ల పెంపకంలో జాగ్రత్తలు తీసుకుని అభివృద్ధి చెందాలని వారు సూచించారు. మండల సమాఖ్య సిబ్బంది, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

కోళ్ల పంపిణీ

సిర్పూర్(టి): మండలంలోని మహిళా సంఘాల గ్రూపుల సభ్యులకు మంగళవారం సిర్పూర్(టి) ఐకేపీ డీపీఎం సారయ్య, ఏపీఎం దుర్గయ్య ఆధ్వర్యంలో కోళ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదిగేందుకు కోళ్ల పంపిణీ చేశామన్నారు. ఎంపీడీవో సత్యనారాయణ, ఎస్బీఐ మేనేజర్ నూతన్‌రెడ్డి, మహిళా సమైక్య అధ్యక్షురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో వైద్యశిబిరం



విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

బెజ్జూర్: ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని డాక్టర్ సతీశ్ అన్నారు. పెంచికల్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని సోమిని గిరిజన ఆశ్రమ పాఠశాలలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్యసిబ్బంది రక్తపరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వైద్యసిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థికి సన్మానం

నెన్నెల: రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన నెన్నెల జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి సయ్యద్ రహ్మాన్‌ను మంగళవారం ఎమ్మెల్యే గడ్డం వినోద్ సన్మానించారు. ఈ నెల 21న మంచిర్యాల జిల్లా కేంద్రంలోని హైటెక్స్‌సిటీలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బ్యాడ్మింటన్ పోటీల్లో రహ్మాన్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. మారుమూల మండలం నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వకారణని, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నెన్నెల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గట్టు మల్లేష్, గొల్లపల్లి మాజీ ఎంపీటీసీ హరీష్‌గౌడ్, నాయకులు తోట శ్రీనివాస్, గట్టు బానేష్, మొహిద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ వేడుకలు



అవగాహన కల్పిస్తున్న ఎయిర్ ఫోర్స్ అధికారి

వాంకిడి: విద్యార్థులు సేవా భావంతో మెలగాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్.సురేందర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సిబ్బంది సంతోష్, రాజమౌళి, శ్రీధర్, కిరణ్ కుమార్, తిరుపతి, సంతోష్, సత్యం, అశ్విని, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: ఇండియన్ ఎయిర్ ఫోర్స్, జిల్లా ఉపాధి కల్పనశాఖ ఆధ్వర్యంలో అగ్నివీర్, ఎయిర్ ఫోర్స్ ఉద్యోగాల గురించి మంగళవారం డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా ఎన్‌ఎస్‌ఎస్ డే సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి తూడూరు దత్తాత్రేయ ఆధ్వర్యంలో కళాశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అధికారి సందీప్, ఎస్‌కె జీనా, అసిస్టెంట్ ప్రొఫెసర్లు వెంకటేశ్వర్లు, శారద, లెక్చరర్లు సంతోశ్,మహేశ్, సానియా, శాంభవి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంఈవోల నియామకం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో 12 మంది ఇన్‌చార్జి ఎంఈవోలను మంగళవారం నియమిస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు విడుదల చేసింది. జిల్లాలో కొన్నేళ్లుగా ఒక్కో ఎంఈవోకు నాలుగు, ఐదు మండలాలకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంతో పర్యవేక్షణ కరువైంది. ఇటీవల టీచర్లు, కొందరు హెచ్‌ఎంలు బదిలీ అవడంతో ప్రస్తుతం పనిచేస్తున్న ఉన్నత పాఠశాలల సీనియర్ హెచ్‌ఎంలకు ఇన్‌చార్జి ఎంఈవోలుగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ విద్యాసంవత్సరంలో పాఠశాలల్లో మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉంది.

ఎంఈవో పేరు	మండలం
ఉదయ్‌బాబు	ఆసిఫాబాద్
ప్రభాకర్	కాగజ్‌నగర్
వెంకటేశ్వర్	రెబ్బెన
శివ చరణ్‌కుమార్	వాంకిడి
సునీత	బెజ్జూర్
సుధాకర్	సిర్పూర్(యూ)
శ్రీనివాస్	దహెగాం
అంజయ్య	తిర్యాణి
రమేశ్‌బాబు	పెంచికల్‌పేట్
శ్రీనివాసరావు	లింగపూర్
వేణుగోపాల్‌రావు	సిర్పూర్(టి)
హనుమంతు	కౌటాల

ఖాళీప్లాట్లు.. దోమలకు ఆవాసాలు



విజయనగరం వెళ్లేదారిలో ఖాళీ ప్లాట్లలో నిలిచిన నీరు

కౌటాల: మండల కేంద్రంలో, గ్రామాల్లో ఖాళీ ప్లాట్లు దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. ఆ ప్లాట్లలో చెత్తాచెదారం, వర్షపు నీరు నిలిచి ఉండడంతో దోమల బెడద తీవ్రంగా ఉంది. దీంతో చుట్టూ పక్కల ఉన్న స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కౌటాల నుంచి విజయనగరం వెళ్లే రోడ్డు సమీపంలో, కౌటాల-మొగడ్‌దగడ్ రోడ్డు సమీపంలో ఖాళీ ప్లాట్ల స్థలంలో వర్షపు నీరు నిలిచి ఉంటుంది. అందులో చెత్తాచెదారం వేస్తుండడంతో దుర్వాసన వస్తుంది. దీంతో ప్రజలు ముక్కు మూసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

రోడ్డుకు మరమ్మతు ఏదీ?



భారీ వర్షానికి కోతకు గురైన గాదిగూడ మండలంలోని కొలామా రోడ్డు (ఫైల్)



మరమ్మతుకు నోచుకోని నార్నూర్ మండలంలోని మాదాపూర్‌రోడ్డు

- భారీ వర్షాలతో తెగిన రోడ్లు, వంతెనలు
- రాకపోకలకు ఇబ్బందులు
- ఇక్కట్లు పడుతున్న ప్రజలు

నార్నూర్: దశాబ్దాల క్రితం నిర్మించిన రహదారుల మరమ్మతుకు నోచుకోలేదు. దీంతో అవి శిథిలమై ప్రయాణం నరకప్రాయంగా మారింది. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు రోడ్లన్నీ కోతకు గురవుతున్నాయి. రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే తారు రోడ్లు ఆనవాళ్లు కనిపించడం లేదు. గుంతల రోడ్ల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. గాదిగూడ మండలంలోని కొలామా, తోయగూడ, హీరాపూర్, చిత్తగూడ, బొడ్డిగూడ, ఖండోవ్ కట్టగూడ, పున్నగూడ, డాబా పున్నగూడ రోడ్లు గతంలో కురిసిన భారీ వర్షాలకు కోతకు గురయ్యాయి. రోడ్డుపై వంతెనలు తెగిపోవడంతో వాహనాలు రాకపోకలు వెళ్లలేని పరిస్థితి. అనేక చోట గుంతలు ప్రమాదకరంగా మారాయని గూడెం, తండాప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నార్నూర్ మండలంలోని బాబేఝరి, చిత్తగూడ, మాల్లేపూర్ చిత్తగూడ, దేవపాటర్ రోడ్లపై ఏర్పడిన గుంతల వల్ల రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్ల మరమ్మతుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని ఆదివాసీ గిరిజనులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాలకు మెరుగైన రోడ్డు రవాణా సౌకర్యాలు కల్పించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. ఇటీవల భారీ వర్షానికి కోత గురైన రోడ్ల మరమ్మతు కోసం ప్రత్యేక నిధులు కేటాయించి మరమత్తు చేయిస్తాం.

– ఖుష్బూ గుప్తా, ఐటీడీఏ పీవో

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మైదానంలో శుభ్రం చేస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. సింగరేణి ఆధ్వర్యంలో స్వచ్ఛత 4.0 కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీసీలోని సింగరేణి మైదానంలో జీఎం సంజీవరెడ్డి, ఇతర అధికారులు చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. ప్రతీ ఉద్యోగి తన ఇంటి చుట్టూనే కాకుండా, తను పనిచేసే గనులు, డిపార్టుమెంట్‌ల వద్ద కూడా పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓటుజీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రెటరీ కొముర‌య్య, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

టింబర్ యార్డ్ కార్మికుల వేతనాలు పెంచాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని టింబర్ యార్డ్ కార్మికులకు వేతనాలు పెంచాలని హెచ్‌ఎంఎస్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. టింబర్ యార్డ్‌ను మంగళవారం ఆయన సందర్శించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి అనిల్ రెడ్డి, నాయకులు పల్లె క్రాంతి కుమార్, శ్రీనివాస్ రాధాకృష్ణ, ప్రతాప్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌రహిత సమాజానికి కృషి



మొక్కలు నాటుతున్న విద్యార్థినులు

పెంచికల్‌పేట్: ప్లాస్టిక్‌రహిత సమాజానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని డీఆర్వో ఆస్మా అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో మంగళవారం ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణం దెబ్బతిని భావితరాల బంగారు భవిష్యత్తుకు ముప్పు వాటిల్లుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని సూచించారు. అనంతరం పాఠశాల మొక్కలను నాటారు. అటవీశాఖ సిబ్బంది, సీఆర్టీలు, విద్యార్థినులు పాల్గొన్నారు.